


మారిన నెల్లిమర్ల రెవెన్యూ డివిజన్

ప్రజాశక్తి-నెల్లిమర్ల, డెంకాడ

నెల్లిమర్ల మండలాన్ని విజయనగరం రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసినట్లు తహశీల్దార్ కె.వి.రమణ రాజు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాల విభజన అనంతరం నెల్లిమర్ల మండలాన్ని విజయనగరం రెవెన్యూ డివిజన్ నుంచి చీపురుపల్లి రెవెన్యూ డివిజన్‌లోకి గతేడాది మార్పు చేసినట్లు తెలిపారు.

ఫలించిన ఎమ్మెల్యే కృషి

రెవెన్యూ డివిజన్ మార్పుపై నెల్లిమర్ల వాసుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవడంతో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు రెవెన్యూ డివిజన్ అంశంపై నేరుగా సిఎం జగన్ మోహన్ రెడ్డిని కలిసి సమస్య వివరించారు. వెంటనే సిఎం జగన్ సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో నెల్లిమర్ల మండలాన్ని మళ్లీ విజయనగరం రెవెన్యూ డివిజన్‌లోకి కలుపుతూ ప్రభుత్వం తాజాగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సిఎం జగన్మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మించిన కర్రల వంతెనపై యువకులు



ఎవరో వస్తారు, ఏదో చేస్తారని ఎదురు చూడలేదు ఆ యువకులు. తమ గ్రామస్తులపాటు శివరాత్రికి వచ్చే వేల సంఖ్యలోని యాత్రికుల కోసం ఆలోచించారు. ఏటా ప్రమాదం ముంగిట నిలబడిన ప్రజలను క్షేమంగా ఒడ్డుకు చేర్చాలని నిర్ణయించారు. అనుకున్నదే తడువుగా చేయి చేయి కలిపి శ్రమదానం చేశారు. తొమ్మిది రోజుల్లోనే సువర్ణముఖి నదిపై దాదాపు వంద మీటర్ల పొడవున కర్రల వంతెనను నిర్మించారు. అందరికీ ఆదర్శంగా నిలిచారు.

చేయి.. చేయి కలిపి..
కర్రల వంతెన నిర్మించి..

ఆదర్శంగా నిలిచిన సరసనాపల్లి యువత

ప్రజాశక్తి-రేగిడి

వంగర మండలంలోని సంగాం వద్దనున్న సంగమేశ్వర స్వామి ఆలయానికి మహాశివరాత్రికి రేగిడి, రాజాం, సంతకవిటి, పాలకొండ, బూర్జ, ఆమదాలవలస, చీపురుపల్లి, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో యాత్రికులు ఏటా తరలివస్తుంటారు. తొమ్మిది రోజులపాటు సాగే ఉత్సవాలకు వచ్చే జనాలు రేగిడి మండలంలోని సరసనాపల్లి మీదుగా సువర్ణముఖి నదిని దాటుకుంటూ సంగమేశ్వర స్వామి ఆలయానికి వెళ్తుంటారు. చుట్టూ తిరిగి మడ్డువలస డ్యామ్ మీదుగా వెళ్లాలంటే చాలాదూరం ప్రయాణించాలి. అదే సువర్ణముఖి నదిలో దిగి వెళ్తే సుమారు 12 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. దీంతో యాత్ర సమయంలో నదిలో దిగి వెళ్లే సమయంలో కొందరు ప్రమాదాల బారిన పడ్డారు. ఏటా ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

అనుకున్నదే తడువుగా..

ఈ నేపథ్యంలో సరసనాపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ యూత్ సభ్యులు ఇటీవల సమావేశమయ్యారు. ఈసారి మహాశివరాత్రికి వచ్చే యాత్రికులకు కర్రల వంతెన నిర్మించాలని నిశ్చయించారు. ప్రజల ఇబ్బందులను దూరం చేయాలని సంకల్పించారు. అనుకున్నదే తడువుగా భారీగా కర్రలను పోగుచేశారు. తొమ్మిది రోజులపాటు యువకులంతా కష్టపడి సువర్ణముఖి నదిలో సుమారు 100 మీటర్ల పొడవున కర్రల వంతెన నిర్మించారు. దీంతో సరసనాపల్లి నుంచి సంగాం సంగమేశ్వరస్వామి ఆలయానికి 12 కిలోమీటర్లు దూరం తగ్గింది. యువత సంకల్పాన్ని అందరూ అభినందిస్తున్నారు. కర్రల వంతెనపైకి జనాలు ఒక్కసారి రాకుండా క్యూలైన్‌లో వచ్చేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని వైఎస్ఆర్ యూత్ సభ్యులు కడగల భీమేష్, కర్రి జగదీష్, తదితరులు కోరుతున్నారు.



కర్రల వంతెన నిర్మిస్తున్న యువత

శివరాత్రి ఉత్సవాలకు
పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-విజయనగరం

మహాశివరాత్రి సందర్భంగా శనివారం రామతీర్థం, పుణ్యగిరి, సంగాం వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. వీటితోపాటు జిల్లా వ్యాప్తంగా పలు శివాలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహాశివరాత్రి సందర్భంగా విజయనగరం దేవాలయాలకు అధికసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున 700 మందితో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నదులు, కాలువలు, కోనేరు, సముద్ర స్నానాలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆలయాల వద్ద ఏర్పాటు తాత్కాలికంగా పోలీసు కంట్రోల్ రూంలను ఏర్పాటు చేస్తున్నట్లు, ఎవరికైనా ఏదైనా సమస్య వచ్చినట్లయితే వారు వెంటనే పోలీసు కంట్రోల్ రూంను సంప్రదించి, పోలీసుల సహాయాన్ని పొందాలని తెలిపారు. ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలని, పార్కింగు ప్రాంతాలను ఏర్పాటు చేయాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. వీటితోపాటు జిల్లాలో పలు శివాలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, దొంగతనాలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

700 మందితో పోలీసు బందోబస్తు

శివరాత్రి సందర్భంగా జిల్లాలోని పలు దేవాలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 700మందితో భద్రతా ఏర్పాట్లు చేసామని ఎస్‌పి తెలిపారు. నలుగురు డిఎస్‌పిలు, 10మంది సిఐ, ఆర్‌ఐలు, 45మంది ఎస్‌ఐలు,ఆర్‌ఎస్‌ఐలు, 150మంది ఎఎస్‌ఐలు,హెచ్‌సిలు, 140మంది కానిస్టేబుళ్ల, 45మంది మహిళా కానిస్టేబుళ్ల, 140మంది హోంగార్డులు, 55 మంది ఎఆర్ కానిస్టేబుళ్ల, 50మంది ఎస్‌టిఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహణలో పాల్గొంటారని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- సమన్వయంతో విధులు నిర్వహించండి : కలెక్టర్ సూర్యకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి నోడల్ అధికారులు, జోనల్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో జిల్లా ఎస్‌పి ఎం.దీపికతో కలిసి ఎన్నికల నిర్వహణకు నియమితులైన నోడల్ అధికారులు, జోనల్ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అధికారులకు ఎన్నికల విధులపై మార్గనిర్దేశం చేశారు. జిల్లాలోని 72 పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నామని, 58వేల మంది పట్టభద్ర నియోజకవర్గ ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. ఎన్నికల పోలింగ్ నిర్వహణకు మూడు రూట్లు, మూడు ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

జోనల్ అధికారులంతా వెంటనే తమకు కేటాయించిన మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ నిర్వహణకు వసతులను పరిశీలించాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఓటర్లు ఏయే గ్రామాల నుంచి ఓటు వేసేందుకు వచ్చేదీ తెలుసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్, ఫర్నిచర్ తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. వెబ్ కాస్టింగ్ కోసం సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్ల సేవలు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధుల్లో గ్రామ, వార్డు వాలంటీర్ల సేవలను ఏ స్థాయిలోనూ వినియోగించుకోవద్దని స్పష్టం చేశారు. పోలింగ్ సందర్భంగా ఏదైనా ప్రాంతంలో ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉందని భావిస్తే ఆయా సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పథకాలకు సంబంధించి ప్రయోజనాలు వంటి పంపిణీ కార్యక్రమాలు, రాజకీయ కార్యకలాపాలు చేపట్టకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఎస్‌పి ఎం.దీపిక మాట్లాడుతూ పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని 72 పోలింగ్ కేంద్రాలకు 13 (తక్షణ స్పందన బృందాలు) క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, ఎపిఎస్‌పి నుంచి కూడా అదనపు బలగాలను కోరామని చెప్పారు. పోలీసు కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. జాయింట్ కలెక్టర్ శ్రీ మయూర్ అశోక్, సహాయ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కలెక్టర్‌కు సమస్యలు చెప్పుకునేందుకు వెళ్లిన వీరఘట్టం ప్రాంత రైతులపై కేసులుపెట్టడం అన్యాయమని, వెంటనే కేసులు ఎత్తివేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు .ఎస్ గోపాలం. బుద్ధరాజు రాంబాబు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేసారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేయనందున మిగిలిపోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ వీరఘట్టం మండలం చలివేంద్రి గ్రామ రైతులు కలెక్టర్ పర్యటన నేపథ్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారని తెలిపారు. సమస్య పరిష్కారానికి కలెక్టర్ చర్యలు చేపట్టక పోగా రైతులపై కేసులు బనాయించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. రైతు సమస్యలను న్యాయబద్ధంగా పరిష్కరించాల్సిన అధికారులు ఇలా దౌర్జన్యానికి పాల్పడి దుర్భాషలాడడం, అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే చలివేంద్రి గ్రామ రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

పాలనపై క్షేత్ర స్థాయి అవగాహన

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రజా సంక్షేమ పాలనపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడంలో గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సుజాత కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న లబ్ధిదారులకు జగనన్న ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలను వివరించాలని కోరారు. 2024 లో వైసిపి గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కష్టి చేయాలన్నారు. ప్రతిపక్ష పార్టీల విమర్శలను ఆరోపణలను తిప్పికొట్టే విధంగా ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ విధానాలను వివరించాలని చెప్పారు. నియోజకవర్గంలో తాము చేస్తున్న అభివద్ధి నిరంతరాయంగా కొనసాగుతుందని అన్నారు. ప్రధాన జంక్షన్లో అభివృద్ధి, నిత్యం పలు వీధులలో రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సమావేశంలో జెసియస్ కన్వీనర్లు ఎస్‌వి రాజేష్, ఆశపు వేణు, వివిధ డివిజన్ల జోనల్ ఇన్‌ఛార్జులు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్‌తో బెంబేలు

ఆందోళన చెందుతున్న పాతఅలుగుబిల్లి గ్రామస్తులు



క్వారీ పేలుళ్లతో బీటలు వారిన గోడను చూపిస్తున్న గ్రామస్తుడు


ప్రజాశక్తి-శృంగవరపుకోట

నిబంధనలకు విరుద్ధంగా లోతుగా క్వారీ బ్లాస్టింగ్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పాతఅలుగుబిల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించిన విలేకరుల ఎదుట ఈర్ల అప్పారావు, సతీష్, కోరాడ అప్పారావు, లక్కియేసు, తదితరులు ఆవేదన చెందారు. గ్రామానికి ఆనుకుని ఉన్న క్వారీలో నిబంధనలను అతిక్రమించి 180 అడుగుల గోతులు తీసి పేలుళ్ల చేపట్టడంతో ఇళ్లు దెబ్బతింటున్నాయని తెలిపారు. వారం క్రితం ఇదేవిధంగా బ్లాస్టింగ్ చేయడంతో భూకంపం వచ్చిందనే భయంతో బయటకు కుటుంబాలతో పరుగులు తీశామని, ఇళ్ల గోడలకు పగుళ్లు వచ్చాయని వాపోయారు. ఈ విషయమై కలెక్టర్ గ్రీవెన్స్‌తోపాటు మైన్స్ ఎడికి, పోలీసులకు ఫిర్యాదుచేస్తే కొన్ని రోజులు ఆపారని, మళ్లీ పెద్ద పేలుళ్లు చేస్తున్నారని తెలిపారు. క్వారీ యాజమానులను ఈ విషయంపై ప్రశ్నిస్తుంటే, తమ కుటుంబసభ్యులను ఉద్యోగాల నుంచి తీసివేస్తామని భయపెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారపార్టీ నాయకుల అండదండలతో అక్రమ బ్లాస్టింగులు చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ విషయంపై మైన్స్ ఎడిని వివరణ కోరగా గతంలో తమకు నాలుగు పర్యాయాలు గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, పరిశీలన చేశామని తెలిపారు. కేవలం తాము బ్లాస్టింగ్ అనుమతులు మాత్రమే ఇస్తామని, వాటి పరిణామ శాతం డిజిఎంఎస్ చూస్తుందని వివరణ ఇచ్చారు.



పేలుళ్లతో దెబ్బతిన్న గోడను చూపిస్తున్న వ్యక్తి



విన్నర్ ట్రోఫీని అందుకుంటున్న విజయనగరం జట్టు

వాలీబాల్ విజేత విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మూడు రోజులుగా పల్నాడు జిల్లా నర్సారావు పేటలో జరిగిన అండర్ 14 వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో విజయనగరం బాలురు జట్టు విజేతగా నిలిచింది. లీగ్ లో పశ్చిమ గోదావరి, అనంతపురం, ప్రకాశం జట్లపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. సెమీ ఫైనల్‌లో గుంటూరు జట్టుపై గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. ఈ మ్యాచ్ లో 25.9, 25.20 తేడాతో విజయం సాధించి రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్ కెవిఎఎన్ రాజు, మేనేజర్ నాగన్న, రమణలను జిల్లా విద్యా శాఖ అధికారి లింగేశ్వర రెడ్డి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వి రమణ అభినందించారు.

చిరుధాన్యాలపై అవగాహన

ఎన్‌వైకె ఆధ్వర్యంలో నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్

ప్రజాశక్తి-విజయనగరం

చిరు ధాన్యాల వినియోగంపై అందరికీ అవగాహన కలిగి ఉండాలని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ జిల్లా యువజన అధికారి జి.విక్రమాదిత్యా అన్నారు. ఎమ్‌విజిఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో గురువారం నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ శాఖ జేడీ విటి రామారావు మాట్లాడుతూ 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని పేర్కొన్నారు. చిరుధాన్యాల వినియోగం ద్వారా ఆరోగ్యం బాగుంటుందన్నారు. యువ చిరుధాన్యాల వాడకంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఎమ్‌వి జిఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎల్ రాజు ఆధునికీకరణ పేరుతో పర్యావరణ పరిరక్షణ మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. యువ సంవాద్ కార్యక్రమంలో భాగంగా ఎంవిజిఆర్ కళాశాలకు చెందిన ఎల్.మౌనిక మహాలక్ష్మి, ప్రవల్లిక, సాయి స్వరూప్ తదితరులు గ్లోబల్ పాలసీపై మాట్లాడారు. వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ యు.త్రివేణి మాట్లాడుతూ చిరు ధాన్యాలకు ప్రాచుర్యం పెంచడంలో ముందంజలో ఉండటం భారత్‌కు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. సెట్విజ్ సిఇఒ రామ్‌గోపాల్, ఉద్యానవన శాఖ డిడి ఎవిఎస్ జమదగ్ని, శాస్త్రవేత్తలు త్రివేణి, సరస్వతి పాల్గొన్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

26న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 26న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సమావేశం స్థానిక జిఎస్ఆర్ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. జిల్లా క్రీడా సంఘాలు రాష్ట్ర ఒలింపిక్ సంఘంతో గుర్తింపు పొందిన రాష్ట్ర క్రీడా సంఘం నుంచి ఎఫ్లియేషన్ లెటర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అఫిలియేషన్ లెటర్‌లను ఈనెల 21లోగా జిఎస్ఆర్ హోటల్‌లో ఇవ్వాలని తెలిపారు.

వైసిపికి అధికారం కలే


ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో వైసిపి తిరిగి అధికారంలోకి రావడం కల టిఎన్ఎస్ఎఫ్ విజయనగరం పార్లమెంట్ స్థానం ప్రధాన కార్యదర్శి మాడుగుల భానుప్రకాష్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మూడున్నరేళ్లుగా అధికారంలో ఉండి ఒక్క కేసులోనైనా తెలుగుదేశం చేసిన అవినీతిని నిరూపించగలిగారా? అని ప్రశ్నించారు. కొడాలి నాని పగటి వేషగాడని, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కొత్త బిచ్చగాడని విమర్శించారు. నారా లోకేష్ గారిని విమర్శించే స్థాయి వీరికి లేదని అన్నారు.

ఇది కోడ్ ఉల్లంఘన కాదా?

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రస్తుతం జిల్లాలో అమల్లో ఉంది. రాజకీయ పార్టీకి చెందిన ఫ్లెక్సీలు కానీ, ముసుగు లేకుండా నాయకుల విగ్రహాలు కానీ ఉండకూడదు. లక్కవరపుకోటలోని సాయిబాబా జంక్షన్ వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ విగ్రహానికి ముసుగు తొడగడం మరిచారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాదా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

– ప్రజాశక్తి, లక్కవరపుకోట



ముసుగు వేయకుండా ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం

జెవివి ఆధ్వర్యంలో
సత్యాన్వేషణ దినం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బ్రూనో బలిదానాన్ని పురస్కరించుకొని శుక్రవారం జరిపిన సత్యాన్వేషణ కార్యక్రమాల్లో భాగంగా జెవివి ఆధ్వర్యాన స్థానిక సత్యడిగ్రీ కాలేజిలో శాస్త్రీయ అవగాహనపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎం.వెంకట రావు మాట్లాడుతూ జెవివి ఆశయాలు, చేపట్టిన కృషిని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాత్ మాట్లాడుతూ బ్రూనో బలిదానం చరిత్ర, శాస్త్రీయ అవగాహన అవసరం , శాస్త్రీయ సమాజం దిశగా విద్యార్థులు చేయాల్సిన కృషిని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెవివి జిల్లా అధ్యక్షులు ఎం.వెంకటరమణ

సీతంలో జపాన్ మేధావుల సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సత్య కళాశాల సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి అధ్వర్యంలో రెండు రోజుల పాటు సదస్సు జరిగింది. ఈ సదస్సులో జపాను శాస్త్ర వేత్తలు మునేతోషి మసానోబు, యోషియాకి ఆనన్, రామ్‌తేజ్ టెక్నాలజీస్ సంస్థ అధినేత శాసుపల్లి సన్యాసిరావు మాట్లాడారు. జపాను రోడ్లనూ భవంతులనూ పోల్చి చూసి మన దేశం అద్భుత ప్రగతి సాధిస్తున్నదని సోయరి కంపెనీ ఉన్నతాధికారి మునేతోషి అన్నారు. జపానులో చాలా భవంతులు, ముందుగానే వేరే కర్మాగారంలో తయారుచేసిన భాగాలను నిర్మాణ స్థలానికి తరలించి అమర్చడం ద్వారా నిర్మితమౌతాయని, నలభై ఏభై అంతస్థులు భవనాలను కూడా అతితక్కువ సమయంలో నిర్మించవచ్చని అన్నారు. సోయరి కంపెనీ డిజైన్ ఇంజనీర్ ఆనన్ తన అనుభవాలను పంచుకొంటూ కార్ల తయారీ లోని సాంకేతిక సూక్ష్మాలను వివరించారు.శాసుపల్లి సన్యాసిరావు మాట్లాడుతూ నాణ్యత మన్నిక జపానుకు పెట్టింది పేరని, అతిసూక్ష్మంగా పరిశీలించగలగడం జపాను నుంచి నేర్చుకోదగ్గ విషయమని అన్నారు. సదస్సులో అన్ని విభాగాధిపతులూ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని తమ సందేహాలను శాస్త్రవేత్తలను అడగడం ద్వారా నివృత్తి చేసుకున్నారు.

వాటర్ ప్లాంట్లలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర వ్యాప్తంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లపై విజిలెన్స్ శాఖ జరిపిన తనిఖీల్లో భాగంగా శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అధికారి ఎ.సురేష్ బాబు ఆధ్వర్యాన అధికారులు జిల్లాలోని పలు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో తనిఖీలు నిర్వహించారు. గంట్యాడ మండలం రావివలసలోని శ్రీవారి ఆక్వా ఇండస్ట్రీస్, కెఎల్‌పురంలోని వాటర్‌ప్లాంట్‌ను విజిలెన్స్ అధికారులు డిఇ సిహెచ్. సత్యన్నారాయణ, ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం, శేషగిరి, అప్పన్న, ఫుడ్‌సేఫ్టీ అధికారి డికె కావ్యరెడ్డి తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించకపోవడంతో సంబంధిత యాజమాన్యంపై చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు.



వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ డిఇ సత్యనారాయణ

శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పుణ్యగిరి ఉమాకోటిలింగేశ్వర స్వామి, సన్యాసయ్యపాలెంలోని సన్యాసేశ్వర స్వామి ఆలయాల్లో మహా శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఇఒలు బి.శ్రీనివాస్, కె.నాగేంద్ర తెలిపారు. ఈ మేరకు పంచాయతీ సిబ్బంది, పోలీస్, ఫైర్, రెండు ఆలయాల ఇఒలతో శుక్రవారం తహశీల్దార్ శ్రీనివాసరావు ఏర్పాట్లపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆలయాల అధికారులు మాట్లాడుతూ వ్యాపారాల వల్ల యాత్రికులకు ఇబ్బందులు లేకుండా రోడ్లు వెడల్పు చేసినట్లు తెలిపారు. సుమారు 300 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని సిఐ సింహాద్రినాయుడు తెలిపారు. ఇఒలు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే ఆలయం వద్ద టెంట్లను, బారీకేడ్లను ఏర్పాటు చేశామన్నారు. పుణ్యగిరి ధారగంగమ్మ లోయ వద్ద గతేడాది ఏర్పాటు చేసిన ఇనుప వంతెనను మరింత పటిష్ట పరిచామన్నారు. దర్శన అనంతరం కిందికి వచ్చేందుకు మరొక మార్గాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. సన్యాసయ్య పాలెంలో కోనేరులో నీటి లోతునకు వెళ్లకుండా ఇనుప కంచెను ఏర్పాటు చేశామన్నారు. పుణ్యగిరికి ప్రతి ఐదు నిమిషాలకు, సన్యాసయ్యపాలేనికి ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సును ఏర్పాటు చేశామని ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. పట్టణం నుంచి పుణ్యగిరి దేవస్థానం వరకు ఉన్న మూడు కిలోమీటర్ల మేర విద్యుత్ దీపాలు ఏర్పాటుతోపాటు జనరేటర్లను సిద్ధం చేశామని ఆ శాఖ ఎఇ రవికుమార్ తెలిపారు. నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దారిగుండా ఆరు చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని, నిత్యం పారిశుధ్యం మెరుగు పరిచేలా 100 మంది సిబ్బందిని నియమించామని పంచాయతీ ఎఒ బివిజి పాత్రో తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలన

పుణ్యగిరిలో శివరాత్రి ఉత్సవాలకు చేసిన ఏర్పాట్లను దేవాదాయశాఖ అధికారి



శృంగవరపుకోట.. ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖాధికారి వైవి రమణీ

వైవి రమణీ పరిశీలించారు. పుణ్యగిరి కొండపైకి ఇఒ నాగేంద్రతో కలిసి చేరుకుని, ఏర్పాట్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ యాత్రికుల రద్దీని నియంత్రించేందుకు కొండ ఎక్కే మార్గంతో పాటు దిగేమార్గం సరిచేశామన్నారు. పుట్టదార వద్ద తోపులాట లేకుండా పోలీస్ శాఖతో సమన్వయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ ఏడాది ఆన్‌లైన్‌లో టిక్కెట్లు జారీ చేస్తున్నామని చెప్పారు. ఆకతాయిల నుంచి రక్షణ కోసం సిసి కెమెరాలు పలుచోట్ల అమర్చినట్లు తెలిపారు.

సంగాంలో వంద మందితో బందోబస్తు

వంగర : మండలంలోని సంగాంలో సంగమేశ్వర ఆలయం వద్ద వారం రోజులపాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు ఆరుగురు ఎస్‌ఐలతో పాటుతో 100 మందితో పటిష్టమైన పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు తెలిపారు. ఈ మేరకు సంగాంలో సంగమేశ్వర ఆలయం వద్దకు బందోబస్తుకు చేరుకున్న పోలీస్ సిబ్బందికి సిఐ ఉపేంద్రరావు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వంగర ఎస్‌ఐ బుడుమూరు లోకేశ్వరరావు పాల్గొన్నారు.

రేగిడి : నియోజకవర్గంలో రేగిడి, రాజాం, సంతకవిటి, వంగర మండలాల్లో మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సిఐ ఉపేంద్ర, రేగిడి ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడారు. రేగిడి మండలం సంకిలి కాశీవిశ్వేశ్వర ఆలయం, గుల్లపాడు ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం, ఖండ్యాం పంచలింగేశ్వరస్వామి ఆలయంపాటు వంగర మండలం సంగాం సంగమేశ్వర స్వామి ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాగావళినది, చెరువులు, జలాశయాలు ఉండటంతో స్నానాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



వంగర.. పోలీస్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న సిఐ ఉపేంద్రరావు

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

ఇళ్లు మంజూరైన లబ్దిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.వి.రమణ మూర్తి సూచించారు. శుక్రవారం హౌసింగ్ డే సందర్భంగా కొండగుంపాంలో ఇళ్ల నిర్మాణాలను ప్రత్యేకాధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు ఉన్న వారు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే లబ్దిదారులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం ఎంపిపి పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల స్థితిగతులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి హెచ్.భానోజీరావు, హౌసింగ్ డిఇ జి.మురళీమోహన్, ఎఇ ఆర్.పవన్, ఎపిఎం ఎల్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వివాహాలతో ఎన్నో అనర్థాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

18ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేయడం వల్ల ఎన్నో అనర్థాలు తలెత్తుతాయని ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల అన్నారు. మండలంలోని వెంకటరమణపేటలో అంగన్వాడీ కేంద్రం పరిధిలో 18 ఏళ్ల వయసులో డెలివరీ అయిన బాలిక ఇంటికి శుక్రవారం వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త క్రాంతి, ఎఎన్‌ఎం గోపమ్మ, ఎంఎల్‌హెచ్ పి.గీత, ఎంఎస్ కె.వసంత పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపడాలి

ప్రజాశక్తి-రేగిడి

సచివాలయ ఉద్యోగుల పనితీరును మెరుగుపడాలని ఎంపిడిఒ జి.కాశీవిశ్వనాథరావు అన్నారు. శుక్రవారం పెద్ద శిర్లాం సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల సర్వీసులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ విధులు, నిధులు, ఖర్చులు, జమ వంటివి ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. పంచాయతీరాజ్ కి సంబంధించి ప్రతిదీ పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు పాటించాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు ముఖ్య భూమిక పోషించాలన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా మండల కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు..

రాయితీపై గడ్డి కటింగ్ యంత్రాలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని మార్లాపల్లికి చెందిన రైతు గోకాడ నాయుడుబాబుకు గడ్డి కత్తిరించే యంత్రాన్ని పశు వైద్యాధికారి గాయత్రి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.33,970 విలువైన యంత్రానికి ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుందన్నారు. రూ.20,382 రైతు చెల్లిస్తే సరిపోతుందన్నారు. గతంలో ఆర్‌బికె ద్వారా దరఖాస్తు చేసుకున్న రైతులకు యంత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు కిరణ్ కుమార్ , రైతులు పాల్గొన్నారు.

రూ.1060తో తిరుపతిలో ప్రత్యేక టూర్

ప్రజాశక్తి- నెల్లిమర్ల

పర్యాటక శాఖ ద్వారా తిరుపతిలో 1060 రూపాయలతో స్థానిక ఆలయాల దర్శనం కల్పిస్తున్నట్లు టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టూరిజం శాఖ ద్వారా తిరుపతిలో ప్రత్యేక ప్యాకేజీతో స్థానిక ఆలయాల దర్శన సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. పద్మావతి, కళ్యాణ వెంకటేశ్వర స్వామి, వకుళ మాత, కపిలేశ్వరస్వామి, వెంకటేశ్వర స్వామి, తిరుమల ఆలయాల దర్శనం గైడ్‌తో సహ కల్పిస్తున్నట్లు చెప్పారు.

కొప్పరలో కాలువల నిర్మాణం

ప్రజాశక్తి-వంగర



కాలువ పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి రామారావు

మండలంలోని కొప్పరలో మురుగునీటి కాలువలు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగు తున్నాయి. గ్రామంలో ఇంతవరకు కాలువలు లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ విషయంపై ప్రజాశక్తిలో పలుమార్లు కథనాలు రావడంతో అధికారులు స్పందించారు. ప్రస్తుతం సచివాలయ వీధిలో పనులు చేపడుతున్నారు. పనులను పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు శుక్రవారం పరిశీలించారు.

సుబ్బారెడ్డిని కలిసిన డిసిఎంఎస్ చైర్‌పర్సన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డిని డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, వైసిపి నాయకులు అవనాపు విక్రమ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయనగరం విచ్చేసిన వైవి సుబ్బారెడ్డిని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య నివాసంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో వీరు కలిశారు.

పాఠశాలను సందర్శించిన ఎంపిపి

ప్రజాశక్తి-వేపాడ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిపి సత్యవంతుడు

మండలంలో కుంపల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంపిపి డి.సత్యవంతుడు ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను, మెనూ రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

వాహనాల వేలానికి స్పందన కరువు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎస్‌ఇబి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సీజ్ చేసిన ఏడు ద్విచక్ర వాహనాల వేలం పాటకు స్పందన కరువైంది. వాహనాలకు అధిక ధరలు నిర్ణయించడంతో వేలం పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. మళ్లీ వేలం వేస్తామని ఎస్‌ఇబి సిఐ ఆర్.జైభీమ్ చెప్పారు.

వైభవంగా వీరాంజనేయస్వామి తీర్థం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది పంచాయతీ మైచర్ల సింగవరం గ్రామంలో వీరాంజనేయస్వామి తీర్థం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, తులసి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. వెంకటరావు, తులసి దంపతుల పెళ్లిరోజు కావడంతో టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి ఆధ్వర్యాన గ్రామస్తులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గొర్లె నాగరాజు. మంచిన అప్పల సూరి, సిరికి సూర్యనారాయణ, సిరికి రమణ, సేనాపతి గణేష్. సేనాపతి అప్పారావు, సిహెచ్.దేవుడు, తదితరులు పాల్గొన్నారు.



గొంప వెంకటరావు, తులసి దంపతులను సన్మానిస్తున్న గొంప కృష్ణ

ఫిష్ ఆంధ్రా యూనిట‌కు ప్రోత్సాహం

కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ఫిష్ ఆంధ్ర యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందిస్తున్నందున ఈ రంగం లో ఆసక్తి ఉన్న యువతను, మహిళలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సూర్య కుమారి తెలిపారు. వండిన చేపల కూరలను మార్కెటింగ్ చేసేందుకు స్టాళ్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను, కూడళ్లను గుర్తించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఫిష్, డైరీ డెవలప్‌మెంట్ యూనిట్ల లక్ష్యాలపై సమీక్షించారు. విద్యార్హతలు లేనందున ఆసక్తి వారికి అవగాహన కలిగించి ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో యూనిట్లను ఏర్పాటు చేయించాలని తెలిపారు. ఎఫ్‌పిఒలు మండలాల్లో జరిగే జెఎంఎల్‌బిసి సమావేశాలకు తప్పక హాజరు కావాలని, అలా హాజరు కాని వారిపై చర్యలు తీసుకోవాలని ఫిషరీస్ డిడి నిర్మలదేవికి ఆదేశించారు. ఎయిర్‌పోర్ట్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో డిగ్రీ పాస్ అయిన వారిని గుర్తించి స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇవ్వాలని ఆ శాఖ అధికారి గోవింద రావుకు సూచించారు. పోలిపల్లిలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తే స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచవచ్చని అన్నారు. కానీలలో తిరిగి షాపింగ్ కాంప్లెక్స్ ఎక్కడ పెట్టాలి, ఎంత మంది నిరుద్యోగులు ఉన్నారు అనే అంశాలను డిఆర్‌డిఎ, మెప్మాల ద్వారా సర్వే చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను నెలకొల్పేలా చూడాలని ఆ శాఖ జెడి డాక్టర్ రమణకు తెలిపారు. సమావేశంలో జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతి రావు, ఎల్‌డిఎం శ్రీనివాస రావు, మెప్మా పీడీ సుధాకర రావు, హార్టికల్చర్ డిడి జమదగ్ని తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

సమన్వయంతో ముందుకెళ్లాలి

గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే కడుబండి

ప్రజాశక్తి-కొత్తవలస

గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు. చింతలపాలెం, దెందేరు, ఉత్తరాపల్లి సచివాలయాల పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహసారథులు తమ పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించాలని చెప్పారు. ఆయా కుటుంబాల్లో ఎవరికైనా పథకాలు అందకపోతే మంజూరు చేయించేందుకు కృషి చేయాలని సూచించారు. గత టిడిపి పాలనకు, వైసిపి పరిపాలనకు పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు పథకాల మంజూరులో వివక్ష చూపించడంతోపాటు లంచాలు తీసుకుని మంజూరు చేయించాయని ఆరోపించారు. ప్రస్తుతం పార్టీలకతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందుతున్నాయని వెల్లడించారు. రూపాయి కూడా అవినీతికి ఆస్కారం లేకుండా పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్, కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ ఛైర్మన్ గొరపల్లి శివ, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్ బొంతుల వెంకటరావు, కర్రి శ్రీను, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పల్ల భీష్మ. మండల మహిళా అధ్యక్షురాలు బొడ్డు చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అడ్డగింతపై టిడిపి నిరసన



నిరసన చేపడుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి -విజయనగరం కోట

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటనను తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురం అనపర్తి వద్ద పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ టిడిపి నాయకులు, కార్యకర్తలు కోట నిరసన తెలిపారు. శుక్రవారం రాత్రి టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లా నుంచి ఆర్ అండ్ బి వరకు సెల్ టార్చ్‌లతో ర్యాలీ నిర్వహించి, అనంతరం అక్కడ నిరసన తెలిపారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న ర్యాలీకి వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేకపోతున్న జగన్మోహన్ రెడ్డి, ప్రజల కష్టాలను నేరుగా వెళ్తున్న చంద్రబాబునాయుడు అడ్డుకోవడం అన్యాయమని అన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు చేసిన చంద్రబాబు నాయుడిని ఈరోజు వైసిపి ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బొడ్డుల నర్సింగరావు, కంది మురళీనాయుడు, బంగారు బాబు, రొంగలిరామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తపాలెంలో కృష్ణమ్మ పేరంటాలు జాతర


పలు క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-బొండపల్లి



జాతర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బొడ్డు రాము, సభ్యులు

మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని కొత్తపాలెంలో శనివారం కృష్ణమ్మ పేరంటాల జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బొడ్డురాము, సర్పంచ్ బొడ్డు సత్యవతి తెలిపారు. ఉదయం 6గంటల నుంచి రాత్రి వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం 7గంటలకు మహిళల కోలాటం, 8గంటల నుంచి జాలారి నృత్య నాటకం ప్రదర్శన ఉంటుందన్నారు. ఉదయం 9గంటల నుంచి వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించి విజేతలకు మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.6వేలు, తృతీయ బహుమతి రూ.4వేలు అందజేస్తామని వివరించారు. మధ్యాహ్నం 12గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4గంటల నుంచి గుర్రపు స్వారీ ప్రదర్శన, 5గంటలకు ఎడ్లబండ్ల ప్రదర్శన ఉంటుందన్నారు. విజేతలకు నగదు బహుమతి అందజేస్తామన్నారు. రాత్రి 9గంటలకు జబర్దస్త్, ఢీ కార్యక్రమాలతో పాటు రేలా రే రేలా ప్రోగ్రాం నిర్వహిస్తామన్నారు. రాత్రి 1గంట నుంచి ప్రముఖ కళాకారిని కె.మంగాదేవి ఆధ్వర్యాన సత్య హరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తారని తెలిపారు. జిల్లా ప్రజలంతా హాజరై జాతరను విజయవంతం చేయాలని రాము, సత్యవతి కోరారు.



ఆర్‌యుబిని పరిశీలిస్తున్న సర్పంచ్ రామస్వామి

ఆర్‌యుబికి మరమ్మతులు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస జంక్షన్ వద్దనున్న రైల్వే అండర్ బ్రిడ్జికి శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. బ్రిడ్జి ఏర్పాటుచేసిన కొద్ది కాలంలోనే మరమ్మతులకు గురైంది. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వార్డ్ మెంబర్లు రైల్వే అధికారులకు తెలియజేశారు. రైల్వే అధికారులు, పంచాయతీ సిబ్బంది సహకారంతో రైల్వే అండర్ బ్రిడ్జికి మరమ్మతులు పూర్తి చేశారు. రైల్వే అధికారులకు సర్పంచ్ రామస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్తపై విచారణ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని రంగాపురంలో అంగన్వాడీ కార్యకర్త నక్క పార్వతిపై ఐసిడిఎస్ సిడిపిఒ ఆర్.ఉమ, మండల ప్రత్యేకాధికారి ఎస్‌పికె మల్లేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. అంగన్వాడీ కార్యకర్త పార్వతి, ఆయా ఆవాల రమాదేవి మధ్య ఈ నెల 4న చిన్నపాటి వివాదం జరిగింది. పార్వతి తనను చంపేందుకు పీక నొక్కారని, పిల్లలకు వండేందుకు ఒక్క ఉల్లిపాయే ఇస్తున్నారని ఆయా రమాదేవి ఇటీవల స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. ఆయా రమాదేవి సమాచారం లేకుండా రోజుల తరబడి సెలవులు పెట్టడమే కాకుండా విధులకు హాజరవుతున్నట్లు రిజిష్టర్‌లో సంతకాలు పెట్టడాన్ని అధికారులు గుర్తించారు. పిల్లలతో తినే కంచాలు కడిగిస్తున్నారని, పిల్లలను ఇంటికి దిగబెట్టకుండా వదిలేస్తున్నారని రమాదేవి ఎదురుగానే చిన్నారుల తల్లిదండ్రులు అధికారులకు తెలిపారు. గ్రీవెన్స్ లో తప్పుడు ఫిర్యాదు చేసినట్లు విచారణ అధికారులు తేల్చారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా రమాదేవిపై తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎస్ఐ ఎం.ముకుందరావు, హెచ్‌సి వైపాపారావు గ్రామస్తులు, బాలింతల సమక్షంలో ఇరువురిని విచారించారు. వీరి విచారణలోనూ ఆయా రమాదేవి చేసింది తప్పుడు ఫిర్యాదుగా వెల్లడైంది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.భాగ్యలక్ష్మి, కె.వి స్వర్ణలత, నాయకులు ఆవాల సత్యనారాయణ, మహిళా పోలీస్ షేక్ మునిషా పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న అధికారులు

'స్వార్థపరుల ప్రచారంతో పార్టీకి నష్టం'

ప్రజాశక్తి-వేపాడ

కొంతమంది స్వార్థపరుల ప్రచారంతో పార్టీకి నష్టమని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి తెలిపారు. శుక్రవారం వేపాడలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. టిడిపి ఆవిర్భావం నుంచి వేపాడ మండలం కంచుకోటగా నిలిచిందన్నారు. ఇప్పటికీ మండలంలో పార్టీకి మంచి పట్టు ఉందని తెలిపారు. పంచాయతీ వార్డు మెంబర్ కూడా గెలవని వారితో ఓ గ్రూపు తప్పుడు ప్రచారం చేయిస్తోందన్నారు. గతంలో టిడిపి ఎమ్మెల్యే విజయానికి అహర్నిశలు శ్రమించిన వారిని, తరువాత అణగదొక్కడం వల్లే గత ఎన్నికల్లో తక్కువ ఓట్లతో ఓటమి పాలైనట్లు చెప్పారు. ప్రస్తుతం వెంకటరావు కుటుంబంపై కోళ్ల కుటుంబం బంధువులతో వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. ఇలాంటి తీరు మారకుంటే పార్టీకి నష్టం తప్పదన్నారు. ఇప్పటికైనా అధిష్టానం ప్రత్యేక దృష్టిసారించి పార్టీ కోసం కష్టపడి పని చేసే వారిని గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సేనాపతి గణేష్, సిరికి రమణ, అప్పలసూరి, సిరికి సూర్యనారాయణ, గొర్లె నాగరాజు, గొర్లె నాగరాజు, గుమ్మడి తాతారావు, సేనాపతి అప్పారావు, ఎన్.వెంకటరావు, తాడి కృష్ణ, వై.సూర్యం, సిహెచ్ దేవుడు, కె.అర్జున పాల్గొన్నారు.

గోతిలో పడి వాలంటీర్ మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి



గోతిలో సింహాచలం మృతదేహం,
ఇన్‌సెట్‌లో సింహాచలం (ఫైల్)

ప్రమాదవశాత్తూ గోతిలో పడి వాలంటీర్ మృతి చెందాడు. ఆ సంఘటనలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... బొబ్బిలి మండలంలోని ఎం.బూర్జవలస సచివాల యంలో గున్న తోటవలస గ్రామానికి చెందిన కంటు సింహాచలం వాలంటీర్‌గా పని చేస్తున్నాడు. ఎం.బూర్జవలస సచివాలయ ఉద్యోగి వివాహానికి ఈ నెల 11న వెళ్లిన సింహాచలం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి కోటి చెరువు కింద దుర్వాసన రావడంతో కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించగా మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. దుస్తుల ఆధారంగా సింహాచలం మృతదేహంగా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివాహానికి వెళ్లి తిరిగి ఇంటి వస్తుండగా ప్రమాదవశాత్తూ గోతిలో పడి మరణించి ఉంటారని కుటుంబ సభ్యులు, పోలీసులు భావిస్తున్నారు. సింహాచలానికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కు మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు రోధిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

శృంగవరపుకోట : శృంగవరపుకోట పట్టణ శివారు ఉన్న సీతమ్మపేటలో శుక్రవారం తాటిచెట్టు దిగుతుండగా ప్రమాదవశాత్తు మోకు తెగి బత్తిన తాతీయలు అనే వ్యక్తికి నడుము విరిగింది. వెంటనే ఆయన్ను ఏరియా ఆస్పత్రికి స్థానికులు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారు. తాతీయలు తాటిచెట్ల నుంచి కల్లు సేకరించి, విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కల్లుగీత కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ కోరారు.

నేరాలు ఘోరాలు

తప్పిన ఘోర ప్రమాదం

ప్రజాశక్తి-బొండపల్లి



తీగలను లారీ లాగడంతో నేలకొరిగిన విద్యుత్తు స్తంభం

మండలంలోని అంబటి వలస సమీపంలో సిఎంఆర్ క్రషర్ ఎదురుగా శుక్రవారం ఉదయం ఘోర ప్రమాదం తప్పింది. మెటల్ తరలించే హెవీ లారీ టైర్లు మార్చేందుకు రోడ్డు పక్కన డ్రైవర్ ఆపాడు. లిఫ్ట్‌తో తొట్టెను పైకి లేపి టైర్లు మార్చిన తరువాత తొట్టెను దించకుండా రోడ్డుపైకి వచ్చేయడంతో విద్యుత్‌లైన్‌కు తగిలి రెండు స్తంభాలు విరిగిపోయి రోడ్డుపై పడిపోయాయి. ఆ సమయంలో రెండువైర్లు ఒక దానికొకటి తగిలి ఫీజులు కొట్టేయడంతో ప్రమాదం తప్పింది. లేదంటే లారీ దగ్ధమవ్వడంతో పాటు రహదారిపై ప్రయాణించే వారి ప్రాణాలు పోయేవని తెలుస్తోంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎస్.రవి అక్కడికి చేరుకొని విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎఇ డి.శంకర్రావు ఆధ్వర్యాన సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. విరిగిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని, అందుకు అయ్యే ఖర్చును లారీ యజమాని నుంచి వసూలు చేస్తామని తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.